
ఈ ఇంట్లో ఇక నేనే పెళ్ళికి మిగిలిపోయాను అన్న థ్రిల్ గమ్మత్తుగా ఉంది నాకు. మూడో అన్నయ్య పెళ్ళి అయిన మర్నాడు 'మా అమ్మాయి నిస్తాం' అంటూ నా గురించి ఎవరో రావటం... వాళ్ళకు నేనే కాఫీ లందించటం, నేను ఇదమిత్థంగా ఏదీ చెప్పకపోవటంతో వాళ్ళు "ఎదురు చూస్తాం... మీ రోసారి అమ్మాయిని చూడ్డానికి రండి" అని నాన్నగారికి చెప్పి వెళ్ళటం. అప్పట్నించీ ఈ థ్రిల్ మొదలైంది.



నిజానికి నా కిప్పుడే పెళ్ళి చేసుకోవాలనీ లేదు. ఎమ్మే పూర్తి చేశాక... మంచి ఉద్యోగం సంపాదించుకోవాలన్న ఆశ పెద్దగా ఉంది. అ దెంతవరకూ తీరుతుందో తెలీదు గాని, ఈలోగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ టూ ఉద్యోగాల్కు పడినా ఈ థ్రిల్‌తో మనసు సరిగా లగ్నం కావటం లేదు.

ఫ్రెండ్స్ సర్కిల్‌లోనూ, బంధు వర్గాల్లోనూ - "ఏరా రామ్మూర్తీ! నీకు అమ్మాయి నిస్తామని పెళ్ళి చూపుల కొచ్చారట గదా!" అని అందరూ అంటుంటే కొంచెం గర్వపడిన మాట నిజం.

ఎప్పుడూ నా వంక చూడని సుప్రియ వైపు గర్వంగా చూశాను. 'అహో... నీకు తెలుసా? నే నొప్పుకుంటే నీకంటే అందమైన అమ్మాయి నా ప్రక్క నుండబోతుంది' అని మనసులో అనుకుంటూ.

"రామ్మూర్తీ! నీ ఉద్దేశ మేమిట్రా... పెళ్ళి చేసుకుంటావా? చేసుకుంటానంటే ఈ వారంలో అంతా కలిసి అమ్మాయిని చూసొద్దాం" అంది అమ్మ.

అది గ్రూప్ - టూ ప్రిలిమినరీకి వెళుతున్న గంట ముందు. ప్రిలిమినరీ ఏం రాశానో గుర్తు లేదు కాని... ఆ అమ్మాయి ఎలా ఉంటుందో అన్న ఊహ చెదిరిన తేనెతుట్టెలా ముసురుకుపోతే తేరుకునేసరికి పరీక్ష హాల్లోంచి అంతా బయటి కెళుతున్నారు.

అమ్మకు నేనేం చెప్పలేదు. అదే ప్రశ్న నాన్నగారు అడిగారు. అమ్మ అడిగిన రెండు రోజులకు ఆయన అడిగారంటే తప్పకుండా వాళ్ళ నుంచి ఉత్తరం వచ్చి ఉంటుంది. నాన్నగారు అలా అడగటంతో ఏదో సిగ్గు ముంచుకొచ్చింది. ఏదీ చెప్పకుండానే ట్రిమ్‌గా తయారై బజారు కెళ్ళాను.

'ఎప్పుడూ తమలపాకుల్ని మేకల్లా నలుముతారు' అని అమ్మనీ, నాన్ననీ వెక్కరించే నేను అనుకోకుండా రెండు రూపాయల తమలపాకుల్ని ఇంటికి తీసుకొచ్చాను. ఇంట్లో అమ్మనీ, నాన్ననీ, వదినల్ని అన్నయ్యల్ని వెక్కిరించటం అలవాటు. ఇంట్లో నేనే చిన్నవాడిని కాబట్టి నేనేం చేసినా చెల్లుతుంది. గారాబం ఎక్కువ.

చిన్నప్పట్నించీ ఏ కష్టమూ ఎరగను కాబట్టేమో, నా మన సింకా మొద్దుబారలేదు. స్పందన

లెక్కువ. అన్నయ్యల కొడుకులతో ఇప్పటికీ ఆడుతుంటే వదిన లంత గేలి చేస్తారు. అయినా వాళ్ళతో ఆడుకోవటం చాలా ఇష్టం నాకు.

"అడ్డగాడిదలా పెరిగి ఆడుకోవట మేమిట్రా? ఇక పెళ్ళి చేసుకో. నీకు పిల్ల నిస్తామని వచ్చినోడికి బాగా పలుకుబడి ఉందట. వాళ్ళే ఏదైనా ఉద్యోగ మిప్పిస్తా మంటున్నారు" అన్నాడు ఒకన్నయ్య.

"ఎప్పుడైతేనేం? జీవితంలో ఓసారి పెళ్ళి చేసుకోవాల్సిందే కదా! చేసుకోరా!" మరో అన్నయ్య.

ఆ మాట మనసుకు చివుక్కున తకింది. ఉద్యోగం నేను సంపాదించుకోలేనా? ఎవరో ఇప్పించడ మేమిటి? వీ ళ్ళెందు కిలా ఆలోచిస్తారు? ఇలాంటి ఆలోచనలు తీవ్రంగా మెదడును తొలుస్తున్నా యీమధ్య.

నాకు తెలుసు. అమ్మకు గాని, నాన్నకు గాని ఇప్పుడే పెళ్ళి చేయాలని లేదని. మరి అన్నయ్య లెందుకు హడావిడి పడుతున్నారు?

నా కెప్పుడైతే పెళ్ళి వా రొచ్చారో అప్పట్నించి ఈ ఇంట్లో వాతవరణం కొంత రంగుమారింది. ఒక వదిన పిల్లాడికి స్నానం చేయిస్తూ... వీపు వాచేలా కొట్టింది. ఆ మెందు కలా విసుక్కుంటుందో నా కర్థం కాలేదు.

"పిల్లలు ఈ పల్లెటూళ్ళో చెడిపోతున్నారు. సిటీ కెళ్ళి చదివిద్దామంటే... ఆయనేమో వెనకా

"వాడి పెళ్ళికి నీ చేతిలో పైస లెందుకు. మా పెళ్ళిళ్ళన్నీ నీ పైసల్తోనే చేశావా? కట్నం డబ్బుల్లోంచి తీసి చేశావు. మాలాగే వాడి క్కూడా వరపూజ రోజు కొంత డబ్బు ఇస్తారు గదా! పది, ఇరవై వేలు. వాటితో పెళ్ళికి ముందు ఖర్చు లవుతయి. పెళ్ళి పందిట్లో పోసిందాంతో కొంత తరువాతి రిసెప్షన్ ఖర్చుకు, మిగత వాటికి సరిపోతయి. వాళ్ళు లక్షదాకా ఇస్తారట. అంటే మాకంటే వాడే నయం. ఇరవై, ముప్పయ్ వేలన్నా వాడికి మిగులుతాయ్," అన్నాడు అన్నయ్య.

ఆ సంభాషణ విని మరో వదిన పిల్లాడిని చంక నేసుకొని అరుగుమీదికి వచ్చింది. "రామ్మూర్తి ఇప్పటివరకు ఈ ఇంటికి ఏం సంపాదించి పెట్టాడని? ఇప్పటి దాకా చదువేనాయె. "మా ఆయ నొక్కడికే గవర్నమెంట్ ఉద్యోగం లేకుంటే ఈ ఇల్లు..." అంది. నాన్నగారు మౌనంగా ఉండిపోయారు.

అమ్మ కూడా వెల్లుల్లిపాయలకు నూనె రాసి పొట్టు తీస్తూ చేట పట్టుకొని వచ్చింది అరుగుమీదికి.

బావిమీద బట్ట లుతుకుతున్న చప్పుడు. మరో గదిలో ఇద్దరు పిల్లలు ఏడుస్తూ పోట్లాడుకుంటున్నారు. బట్టలు మూట కట్టుకుపోతున్న మంగమ్మ ఓసారి తొంగిచూసి పోయింది.

లుంటాయని!" అంది.

"అదేం టమ్మా! మీకే దాదాపు ఆరు పట్టుచీరలు పెట్టాం. అదీగాక, మీవాళ్ళు లక్ష రూపాయ లిస్తూ పది తులాల బంగారం పెట్టాలన్న కండిషన్ పెట్టారు. నేను మాత్రం ఎక్కడినుంచి తేగలను. ఇంట్లో అంత బంగారం లేదు కూడా. ఏదో మంచి సంబంధమని... వాడి కిచ్చిన కట్నంలోనే ఇదంత నర్దాను" అని చెప్పాడు నాన్న.

"భేష్! కొడుకుల చేతులు కొడుకుల నెత్తిమీదే పెట్టా రన్నమాట! ఇలాంటి పెళ్ళి మీరు జరిపించారన్న పేరెందుకు? మా డబ్బుతో మేం చేసుకోకపోయేవాళ్ళమా?" అంది.

ఆ మాటకు నాన్న హతాశు డయ్యాడు. "నా దగ్గర డబ్బుండి అలా చేయలే దమ్మా! రిటైర్‌మెంట్ డబ్బు రాగానే అందరికీ ఇవ్వనా. తండ్రిని, నాలో పక్షపాత మెందు కుంటుంది?" అన్నాడు ఆమెను శంతవర్చాలని.

"అందరి పెళ్ళిళ్ళు ఇలాగే చేశారా?" అనడిగింది.

# అమ్మపిచ్చిని

## కె.వి.నరేందర్



ముందాడుతరాయె. ఇంకా ఎందు కాలోచిస్తారో, ఎప్పుడైనా వెళ్ళిపోవాల్సిందే కదా!" అంటోంది.

ఇలాంటి ఇంటి విషయాల్ని పట్టించుకొని నేను, మొదటిసారిగా ఆలోచించటం మొదలెట్టాను. నే నింకా పెళ్ళి కొప్పుకోలేదని కొంత అసహనంగా కనిపిస్తున్నా రంత! వీళ్ళంత కొద్ది కొద్దిగా మారుతున్నారు. ఎందుకు?

ఆ రోజు...బాత్రూంలోంచి వచ్చి నా గదిలో డ్రెస్ చేసుకుంటున్నాను.

"వాళ్ళ నుంచి మళ్ళీ ఉత్తరం వచ్చిందిరా రఘూ!" అంటున్నారు నాన్న ఒకన్నయ్యతో.

"మళ్ళీ వచ్చిందా? మ రింకేం? ఓసారి వెళ్ళి చూసి వస్తే సరిపోతుంది. కట్నం బాగానే ఇస్తారట. శ్రావణ మాసంలో మంచి రోజు లున్నాయి కూడా."


"మంచి రోజులు సరేగాని, మూడో వాడి పెళ్ళయి ఏడాది కూడా కాలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. రిటైర్ అయినప్పట్నించి సరిగా జీతం రావట్లేదు. మీకు తెలీదా?" అన్నాడు నాన్న. ఎక్కడో అంతరాల్లో పేరుకున్న ఆవేదన ధ్వనించింది.

"అలాగంటే... ఇన్ని రోజుల్నుంచి మనకున్న మూడెకరాల పొలాన్ని దున్ని సాగు చేసి వడ్లు పండిస్తున్నాను. లేకపోతే ఈపాటికి కూటికి కూడా ఇబ్బంది పడేవాళ్ళం" అన్నాడు ఇందాకటి రెండో అన్నయ్య. తను సాగు చేయకపోతే మీరు ఆకలి చావులు చస్తారన్న ధీమాతో.

మూడో వదిన రేడియో పట్టుకొని వచ్చింది. ఆమె కిప్పుడు ఏడో నెల. రేపో మాపో వచ్చి తీసుకెళ్తానని తండ్రి ఉత్తరం రాయటంతోనేమో చాలా ఆనందంగా ఉంది. మరో ఆర్నెలల దాకా ఈ ఇంటి పీడ తప్పుతుందని కావచ్చు.

ఆమెను చూసి నాన్నగారు ఇబ్బందిగా ఫీలయ్యారు. బి.ఏ. వరకు చదివింది ఆమె ఒక్కర్తే ఆ ఇంటి కోడళ్ళలో. వంటింట్లో ఇంగ్లీష్ పదాలు వాడి అందర్నీ తక్కువగా అంచనా వేస్తుంది.

తను తెచ్చిన కట్నం లక్ష రూపాయలకు పదిహేను వేలే మిగిలి ఉందని భర్త ద్వారా తెలిసిన మర్నాడే మామగార్ని నిలదీసి అడిగిందామె ఒక రోజు. పెళ్ళి ఖర్చుల కయ్యాయని సమాధానం చెప్పాక - "అఫ్కోర్స్ మీకేం ఖర్చు




"అవును. అందరివీ అలాగే చేశాను." నాన్న కూడా గంభీరంగా చెప్పి, వాలు కుర్చీలో కూలబడి ఆలోచనల్లో మునిగిపోయారు.

ఇప్పటివరకూ ఎవ్వరూ ఎదురుచెప్పని ఆయన మనసు దాన్ని తట్టుకుందో, లేదో కాని, కళ్ళలో నన్నటి నీటి పొర తళుక్కుమని మెరిసింది.

"మామగారూ!" అంటూ ఇంకో వదిన టీ కప్పుతో వచ్చి ముందు పెట్టి పోయినా ఆయన తాగలేదు.

చాలాసేపటికి అందులో ఈగ పడి చచ్చిపోయింది. ఆ రోజు అమ్మ ఎవ రింట్లోనో సత్యనారాయణ వ్రతానికి వెళ్ళింది.

ఆ రోజునుంచీ ఆ వదినంటే హడల్!

"ఇంతకీ వా డేమంటున్నాడు? చేసుకో నంటున్నాడా?" అన్నయ్యలు రెట్టించారు.

"ఏమో... వాణ్ణే అడగండి" అన్నాడు నాన్న.

గదిలో ఉన్న నాకు అందరిమీదా చిర్రెత్తుకొచ్చింది. ప్రతి చిన్న సమస్యనూ అంతర్జాతీయ స్థాయిలో చర్చిస్తారు ఈ ఇంట్లో. ఎరికి వారే తమ సంపాదనని ఈ ఇంటికి పెడుతున్నామని భ్రమిస్తారు. ఎవరికి వారే ఈ ఇల్లు తమ వల్లే ఇంత ఎదిగిందని అనుకుంటారు. ఎవరికి వారే ఈ ఇల్లు తమవల్లే పరువు ప్రతిష్ఠలతో తులతూగుతుం దనుకుంటారు.

కాని... నాన్నగారి పూర్తి జీతం ఖర్చయి, అప్పులు ఎందుకు మిగులుతున్నా యన్నది వీళ్ళు గుర్తెరగరు. ఎరిగినా దాన్ని పట్టించుకోరు... ఎందుకంటే ఖర్చు పెట్టాల్సి వచ్చినప్పుడు తప్పుకోలేమని తెలుసు కాబట్టి.

ఈమధ్య నన్ను కేంద్రంగా తీసుకోవటం, ఆయన్ని పీడించటం అలవాటయింది. "వాడి చదువులకు ఖర్చు పెట్టినంత మా కేమైనా ఖర్చుపెట్టారా?" అని తడిగారు పెళ్ళిళ్ళయ్యాక కూడా. నా దృష్టిలో ఇరవై ఒక్క సంవత్సరాలలోపే తండ్రిని డబ్బు అడగాలి. ఆ తరువాత కూడా చేయి చాపితే... ఆ తల్లిదండ్రులు ఒక అసమర్థుడిని కన్నట్టు లెక్క.

అరుగుమీంచి నాకు పిలుపొచ్చింది. మరో అన్నయ్య అప్పుడే బయటినుంచి వచ్చాడు. అతడు మా ఊళ్ళోనే ప్రయివేట్ కంపెనీలో పని చేస్తాడు.

నేను రాగానే - "ఏరా అమ్మాయిని చూసొద్దామా?" అనడిగారు ఇద్దరూ.

నేను కొంచెంసేపేమీ మాట్లాడలేదు. నాకు కంపరంగా ఉంది. ఒక జీవిత భాగస్వామిని, మనసా, వాచా, కర్మణా, అరవై ఏళ్ళు తోడుగా ఉండే ఆడదాన్ని అయిదు నిమిషాల్లో కాఫీలు తాగుతూ నిర్ణయించుకోవటం.

మళ్ళీ అడిగారు... నేను ఆలోచిస్తూ ఉండిపోయాను.

"నోరు లేదా? అటో ఇటో చెప్పెయ్!" సీరియస్‌గా అన్నా డొక అన్నయ్య.

వాళ్ళు నా పెళ్ళి నెందు కంత సీరియస్‌గా తీసుకుంటున్నారో అర్థం కాలేదు, కాని బాధేసింది.

"నేను చేసుకోను." ముఖం సీరియస్‌గా పెట్టి చెప్పాను.

"ఏం? లక్ష రూపాయలకన్నా ఎక్కువ ఎవడూ ఇవ్వడు." నా మౌనం అంత కట్నం గురించే ననుకున్నాడు అన్నయ్య.

అమ్మ కళ్ళతోనే నవ్వింది.

"ఇం కెప్పుడు చేసుకుంటావ్?"

"ఉద్యోగ మొచ్చాక."

బి.ఏ. చదివిన వదిన కిసుక్కున నవ్వింది. ఎందుకంటే నిన్ననే గ్రూప్ టూ ఫలితాలు వచ్చి పాస్ కాలేదని ఆమెకు తెలుసు.

నాకు తల కొట్టేసిన ట్లయింది. ఎగతాళి చేసినట్టుగా చూశా రంతా! అక్కడి నుంచి చరచరా బయటపడ్డాను. ఎక్కడెక్కడో తిరిగి పొద్దుపోయాక ఇల్లు చేరాను.

అంతా తిని పడుకున్నాక నేనూ పీటమీద కూచున్నాను తిండికి. అన్నం పెడుతూ అమ్మ అంది - "నువ్వు పెళ్ళి చేసుకోరా" అని.

అన్నం కెలకటం మరిచిపోయి ఆశ్చర్యంగా చూశాను అమ్మని. కంఠంలో అడ్డుపడ్డ దుఃఖ మేదో బయటపడకుండా కొంగు నోటి కడ్డం పెట్టుకుంటే, కట్టలు తెగిన ఔదార్య మేదో కళ్ళని తడిపింది.

"ఎం... దు... క... మ్మా?" అని మాత్రం అడగగలిగాను.

"ఎందుకు లేదులే... తిను" అంది నిభాయించుకొని.

"ఇంకా రెండేళ్ళవరకూ చేసుకోదలుచుకోలే దమ్మా!" అని చెప్పాను. అమ్మ ఎందు కలా అడిగిందో నా కర్థం కాలేదు కాని, నేను బయటికి వెళ్ళాక ఏదైనా రభస జరిగిందేమో అనుకున్నాను.

ఇప్పటివరకూ ఈ ఇల్లు ఒక ఆనంద నిలయంలా ఉండేది. ఎందు కిలా మారుతోంది? ఎందుకో మిగతా అన్నం తినా లనిపించలేదు. లేచి వెళ్తుంటే పోపు డబ్బా దులిపి అమ్మ ఏభై పైసల చిల్లర తీసిస్తూ చెప్పింది.

"ఇంట్లో రెండు రోజుల్నించి తమలపాకులు లేవు. ఆయన దగ్గర పైసా లేదు. ఎవరు తెస్తారు చెప్పు. కొట్టు కెళ్ళి కొనుక్కురా" అంటూ ఇచ్చింది.

మనసు మూగగా మెలి తిరిగింది. ఈ ఇంట్లో అందరి మధ్యా ఏదో దూరం కనిపిస్తోంది. ఎందు కిలా జరుగుతోంది? ఆలోచిస్తూ ఒక గది ముందునుంచి నడుస్తున్న వాడినల్లా ఆగిపోయాను.

"ఆయన నా పిల్లల కెప్పుడైనా బట్టలు తెచ్చాడా? పుస్తకాలు కొనిచ్చాడా?" అంటున్న అన్నయ్య కంఠం.

"చారెడు చాకిరీ చేస్తే పిడికెడు కూడు దొరకటం తప్ప ఏం సుఖముందీ ఈ కొంపలో!" వదిన మాట. అక్కడినుంచి కదిలాను.

"డ్రెస్ కుట్టిచ్చుకోవడానికి డబ్బు లడిగితే లేవన్నాడు. పెళ్ళయ్యాక పాకెట్ మనీ కూడా అడుగుతున్నానా?" ఇంకో గదిలోంచి.

"ఈ ప్రయివేట్ జా బేదో మా ఊళ్ళోనే చూసుకోరాదా చెప్పండి." బి. ఏ. చదివిన వదిన నిలదీస్తోంది.

ఈ ఇల్లు ఒక నరకకూపంలా తోచింది నాకు. మర్నాడు నేను రెండేళ్ళ దాకా పెళ్ళి చేసుకోనన్న విషయం చర్చలకు వచ్చింది.

తరువాతి రోజు బియ్యే చదివిన వదినని పురుటికోసం తీసుకెళ్ళడానికి వాళ్ళ నాన్నగారు వచ్చారు. వెంట అన్నయ్య కూడా వెళ్ళాడు. వెళ్ళిన వారం రోజులకు అన్నయ్య నుంచి ఉత్తరం వచ్చింది.



**దావా**

**"పరువునష్టం దావా వేయాలా? ఎవరి మీదా?" అడిగాడు లాయర్.**

**"అన్తమానూ పాత పేపర్లు కొంటామంటూ మా ఇంటి చుట్టూ తిరిగే మనిషి మీద..." కోపంగా చెప్పింది రచయిత్రి.**

**అడబాల సూర్యనారాయణ [తుని]**

తనకు అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం దొరికిందని... ఈ వారంలో వచ్చి తన సామాను తీసుకెళ్తానని రాశాడు నాన్నగారికి. ఆ ఉత్తరం అమ్మనీ, నాన్ననీ, నన్నూ బాధపెడితే మిగతా వాళ్ళందరిలో ఉత్సుకతని రేపింది.

మొన్నటి వరకూ రంగుల కలలున్న ప్రపంచంలో తేలిపోయిన నాకు వాళ్ళందరి మీదా చిరాకు పుట్టింది. ఏ ఒక్క క్షణమూ ఇంట్లో ఉండాలనిపించలేదు. వారం తిరక్కముందే వెళ్ళిపోయిన అన్నయ్య కొత్త స్కూటర్ మీద వచ్చాడు.

"ఇదెప్పుడు కొన్నావురా?" నాన్నగారడిగినా సరిగా చెప్పలేదు.

అది చూసి పెద్ద వదిన మొహం వెలవెలబోయింది. రెండో అన్నయ్య ముఖం కొంచెం మాడ్చుకున్నాడు. నా భయమల్లా ఒక్కటే. వీళ్ళందరి చిరాకులూ అమ్మమీదే ప్రయోగిస్తారు.

నాకు స్కూటర్ నడపాలన్న బలమైన కోరిక ఉన్నా అడగాలనిపించలేదు. లారీలో తన సామాను ఆయన తీసుకెళ్ళాక, ఒక వదిన చిన్న రభస చేసుకొని పుట్టింటికి తయారైంది. ఆ రభసను సమర్థించిన అన్నయ్యా తనూ తయారయ్యాడు ఇంట్లోంచి వెళ్ళిపోవడానికి.

ఇల్లంత ఉద్రిక్తతతో నిండిపోయింది. ఆవరకు ఆయన వెళ్ళిపోయాడు. పోతూ పోతూ అమ్మతో, నాన్నతో పెద్దగా గొడవ పడి.

ఇన్నాళ్ళూ ఎదురుచూస్తున్న వాడలోని వారందరికీ అదో మంచి చర్చనీయాంశమైంది. ఫలితంగా ఇల్లంత మాటలే కత్తులైనట్టు బోసిపోయింది.

సరిగ్గా అప్పుడే మా ఊరి పోస్టాఫీసులో ఉద్యోగం వచ్చింది నాకు. నా ఆనందానికి హద్దుల్లేవు. ఎల్.డి.సి. ఉద్యోగమైనా స్వీట్లు కొనుక్కొచ్చి పంచాను. ముఖ్యంగా అమ్మ బాగా సంతోషించింది.

కనీసం నా ఆనందం ఇంకా కరిగిపోనేలేదు. మిగిలిన అన్నయ్య నాన్నతో చెప్పాడు:

"పిల్లలు ఇక్కడ సరైన చదువు లేక చెడిపోతున్నారు. నేను కరీంనగర్ వెళ్ళి చదివించుకుంటాను."

నాన్న అయోమయంగా చూశారు.


"ఇన్ని రోజులు ఇక్కడే ఉండి వ్యవసాయం చేశాను కాని, నాకిప్పుడు చేసే ఓపిక లేదు. నేను వీళ్ళందరి కోసం శ్రమ పడ్డాను కాని, నా పిల్లల కోసం ఎవడైనా శ్రమపడతాడా? అందుకే పిల్లల అడ్మిషన్లు నిన్న తీసుకొని వచ్చాను" అన్ని చెప్పాడు.

అమ్మ వంటింట్లో చాటుగా ఏడ్చింది -

"చిన్నవాడికి ఇక్కడే ఉద్యోగం వచ్చింది. ఇంకేం వాడుంటాడు కదా!" అని చెప్పాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. వాళ్ళు పిల్లలతో వెళ్ళిపోయారు. రోజంత జనరంజని రేడియోలా ఉండే ఇల్లు మూగవోయింది.

లంకంత కొంపలో... శవం తరలిపోయిన స్తబ్దత... నిశ్శబ్దం... వెలితి. ఉక్కిరిబిక్కిళ్ళలో గుండెల్ని పిండినంత బాధగా ముగ్గురం మిగిలిపోయాం.

ఈ స్తబ్దత పోవాలి. ఈ నిశ్శబ్దం అణిగిపోవాలి.




ఎలా... ఏం చేయాలి? అన్నం తింటూ చెప్పాను అమ్మకు. "అమ్మా! నేను పెళ్ళి చేసుకుంటాను."

నా మాటకు అమ్మ నవ్వింది. ఈ ప్రపంచంలో కల్తీలేనిది, కల్మషం లేని అమ్మ నవ్వొక్కటేనేమో.

"ఎందుకమ్మా... నవ్వుతావ్?"

"నువ్వు ముందు పెళ్ళి చేసుకోనని ఈ ఇంట్లో అందరి మనస్తత్వాలు బయట పెట్టావురా... నీకు తెలీదు, అంతర్గతంగా ఇన్నాళ్ళూ ఉడికిపోయిన సమస్య. నీకు పెళ్ళి కాకముందే ఈ ఇంట్లోంచి తప్పుకుంటే, సభ్యసమాజం నవ్వుతుందని, పెద్ద మనుషుల్లా ఈ ఇంట్లోంచి బయటపడాలని, నీకు పెళ్ళి చేయాలని ప్రయత్నించారు. నువ్వింకో రెండేళ్ళదాకా పెళ్ళి చేసుకోవని తెలిసి... తప్పనిసరిగా వెళ్ళిపోయారు" అంది.

అమ్మ మాటలో... ఎక్కడో యథార్థం. అది నా ఆలోచనా పరిధికి మించిందేమో! సరిగా అర్థం కాలేదు.

"వెళ్ళిపోయిన ఇద్దరన్నయ్యలూ స్కూటర్లు,



నంబర్

"నాన్నా! ఓ రిక్షా కొనాలంటే ఎం తవుతుంది?" అడిగాడు కొడుకు.

"హు... అయితే పేపర్లో మళ్ళీ నీ నంబర్ కనిపించేట్టుందన్నమాట..." కోపంగా అన్నాడు తండ్రి.

గొంటు శ్రీనివాస్ [కవిటి]

ఒకడు సుజుకీ కొన్నారు కదరా!" అంది మళ్ళీ అమ్మ.

"అవును" అన్నాను నేను ముక్తసరిగా.

"మొన్నటివరకూ తమలపాకులు తేవడానిక్కూడా ఎవరి దగ్గరా చిల్లి గవ్వలేనట్లు ప్రవర్తించారు."

గాద్గదమైన అమ్మ మాట నిజమనిపించింది. అది వాస్తవం కూడా!

అన్నం తింటున్న నామీద చెయ్యేసి చెప్పింది. అమ్మ స్పర్శ ఎంత చల్లగా ఉంటుంది!

"నానీ! ఈ ఇంట్లో చిన్నవాడివని మేం చేసే గారాబానికే పొంగిపోయేవాడివి కదరా! నిజానికి నీకు గారాబం తప్ప మరేం దక్కిందని? చిన్నవాడు తప్ప వాడికంటే ముందు పుట్టిన వాళ్ళందరూ ఇంటికోసమే కష్టపడతారని చెప్తుందీ లోకం.

"కాని... చిన్నవాడు పెరిగి పెద్దయ్యి... చదువులు పూర్తయి, పెళ్ళి చేసుకునేవరకూ ఇంటిమీద ముందు వాళ్ళకు జరిగిన పెళ్ళిళ్ళు, బారసాలలు, పుట్టినరోజులు, కేశఖండనాలు, పండగలకు బట్టలు - అన్నీ కొడుకులు, కోడళ్ళు మనుమళ్ళన్న ప్రేమతో ప్రతి తండ్రీ భరిస్తాడు. ప్రతి తల్లీ పెట్టాలంటుంది.

"ఇక్కడే... కొన్ని కుటుంబాల్లో ముందు వాళ్ళు ఆర్థికంగా లాభపడేది. ఎవరికీ ఏ లోటూ రాకుండా, ఎవర్నీ చిన్నబుచ్చకుండా మీ నాన్నగారు అన్నీ సమకూర్చారు ఇన్నాళ్ళు. కానీ... నీకూ, నీ భార్యకూ, నీ పిల్లలకూ పెట్టే సమయం రాకముందే ఇంట్లో ఇలా వేర్పాటు వాదాలు మొదలవుతాయి. అవి తారస్థాయికి చేరుకొని ఉమ్మడిగా ఉన్న కుటుంబం ముక్కలవుతుంది కూడా! అందుకే చిన్నవాడికి గారాబం తప్ప... ఏం మిగలదు!"

అమ్మేదో మేడిపండు పొట్ట విప్పినట్టు చెప్తోంది. ఇన్నాళ్ళూ ఈ ఇంట్లో అంతర్గతంగా ఒక కుళ్ళు పారుతూందని మాట మాత్రంకైనా నేను ఊహించలేదు.

"పెద్దవాళ్ళ పిల్లలతోటే చిన్న కొడుకూ ఎదుగుతాడు. నువ్వు, నీ అన్నల పిల్లల మీద చూపించిన అనురాగం, ఆప్యాయతలన్నా కనీసం నీ పిల్లలకు దక్కవురా! ఎందుకంటే నీకు పిల్లలు పుట్టేసరికి ఎవరికి ఎవరన్న రీతిలో వేరుపడి ఉంటారు.

"ఈ వేర్పాటు వాదంలో సమిధలా నమసిపోయేది చిన్నవాడే! అందుకే చిన్ననాటి గారాబం తప్ప... వా డేమీ మిగుల్చుకోడు. ఆ గారాబం మరో నిందని కూడా తెచ్చిపెడుతుంది - చిన్నవాడికి చాటుగా ఏదో అందజేస్తున్నామని. ఇదంత అందరికీ వర్తిస్తుందని చెప్పను కాని, చాలా ఉమ్మడి కుటుంబాల్లో ఇది జరుగుతుందని చెప్తున్నాను. నిజానికి ఈ రోజుల్లో ఆడపిల్లకు పెళ్ళి చేయటం ఒక యజ్ఞమైంది కాని... కూతుర్ని మించిన ఆప్యాయతలు కొడుకు లివ్వర్రా!" అంది.


నాకు అన్నం తినా లనిపించలేదు. అమ్మ స్థాయిలో మాట్లాడేంత జ్ఞానమూ నాకు లేదు. మౌనంగా లేచి నా గదిలోకి పోయాను.

మర్నాడే అమ్మ వెళ్ళి నా పెళ్ళి సెటిల్ చేయించుకొచ్చింది. నేను ఒప్పుకున్నందుకు. మనసు డోలాయమానంగా ఊగుతోంది. ముహూర్తం పెట్టించారు. చాలా నిర్లిప్తంగా పెళ్ళి జరిగిపోయింది.

అన్నయ్యల పెళ్ళిళ్ళకు నే నెంత హడావిడి చేశానో... ఆ అలికిడి లేదు, ఆ కోలాహలం లేదు. బంధువుల హంగామా కూడా అంతగా లేదు.

పెళ్ళి ఒకటి, రెండు రోజు లుందనగా అన్నయ్యలు, వదినలు వచ్చారు. స్కూటర్లమీద, సుజుకీల మీద. నా మనసు పూర్తిగా చిన్నబోయింది. ఏదో వెలితి. ఒక పండగలా జరగలేదు... నేను కన్న కలలకు భిన్నంగా జరిగింది.

ప్రమద నా భార్యగా వచ్చింది. రిసెప్షన్ తెల్లారి అంత వెళ్ళిపోయారు. మొదటి రాత్రే... ప్రమద - "ఈ పల్లెటూళ్ళో బోర్. మీ రెలా ఉంటారండీ?" అనడిగింది.




**కృష్ణ: అమ్మా! నాన్న మేడ మెట్ల మీంచి జారి పడ్డాడు.**
**తల్లి: అయ్యో! బాగా దెబ్బ తగిలిందా?**
**కృష్ణ: ఏమో, నేను ఇక్కడికి వచ్చేసరికి ఇంకా కింద మెట్టుమీదకి రాలేదు.**

**దండెం రాజయ్య [కోర్నకల్]**

నా గుండె పొరల్లోకి ఎవరో గునపం దింపిన శబ్దం.

"అయినా మీ ఊరు బావుందండీ. భలేగా వాగు, బ్రిడ్జి, గుడి, కొబ్బరిచెట్లు, పొలాలు, రచ్చబండ..." అన్ని పొగిడింది.

నేను 'అమ్మయ్య' అనుకున్నాను. వారంలోనే అమ్మతో బాగా కలిసిపోయింది ప్రమద.

చాలా రోజుల తరువాత నేను హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ఇల్లంత మళ్ళీ కల కల లాడినట్లనిపించింది.

అంతలోనే - రోజు మాదిరి పోస్టాఫీసు కెళ్ళిన నన్ను ఆఫీసర్ పిలిపించుకొని ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు చేతిలో పెట్టాడు. మర్నాడే జాయినవ్వాల్సిన ఆర్డరది.

"ఇదేంటి?" అన్నాను అయోమయంగా.

"నీకు నిజామాబాద్ బ్రాంచికి ట్రాన్స్‌ఫరయింది. కంగ్రాట్స్! కాని ఇంత తొందరగా నిన్ను ట్రాన్స్‌ఫర్ చేయటమే నా కర్థం కాలేదు" అన్నాడు.

నే నింకా ఆ షాక్ నుంచి తేరుకోలేదు.

"కంప్లెయింట్ వల్ల మాత్రం కాదు. మొత్తానికి సిటీలో పడ్డావోయ్. పార్టీ ఇవ్వవూ?"

కొలీగ్స్ ఆట పట్టిస్తున్నారు. అది పట్టుకొని ఇంటి కెళ్ళాలంటే భయమేసింది. ప్రమద కూడా సంతోషిస్తుందో, లేదో. ఇంటికి రాగానే ఒక నిర్ణయాని కొచ్చి అమ్మతో, నాన్నతో అన్నాను.

"నేను అక్కడికి వెళ్ళి ఈ ఉద్యోగం చేయను. కావాలంటే రిజైన్ చేస్తాను నాన్నా" అని.

నాన్నగారు పిచ్చివాడిలా చూశారు. అమ్మ కంగారు పడింది. "అదేంట్రా, అలా అంటావు? ఉద్యోగం వదులుకుంటావా? నీకు తెలుసు మీ నాన్నగారి మనస్తత్వం. ఆయన ఈ ఇల్లు విడిచి ఎక్కడికీ రారని. అందుకని ఉద్యోగం వదులుకుంటావా? మీరు పుట్టకముందు ఈ ఇంట్లో మీ మిద్దరమే ఉన్నాంరా. ఇప్పుడు ఈ చివరి దశలో కూడా మీ మిద్దరమే. అంతేగాని, నువ్వు ఉద్యోగం వదులుకోవద్దు" అంది కంఠం పూడుకుపోగా.

ప్రమద అప్పుడు తయారవుతోంది కొంచెం బాధగానే. అందరి ఒత్తిడిమీదా లారీ తెచ్చి సామాను సర్దాన్ను. లారీ కాబిన్‌లో ఎక్కుతుంటే... అమ్మ కళ్ళలోంచి జల జలా రాలిపడ్డాయి అశ్రుకణాలు. నాన్నగారు వాలుకుర్చీలోనే వాలిపోయారు.

లారీ కదిలింది. ఊరి పొలిమేరలు దాటాక ప్రమద నా భుజంమీద ఒరిగిపోతూ అంది - "మా నాన్న చాలా పలుకుబడి గల వ్యక్తి కదా! అందుకని ఆ పల్లెటూళ్ళో ఉండలేక నేనే ఉత్తరం రాసి ట్రాన్స్‌ఫర్ చేయించాను. ఇప్పుడు సిటీలో మనిద్దరమే స్వేచ్ఛగా... హాయిగా..." ఇంకా... ఏదో చెప్తోంది.

ప్రమద నా కిప్పుడు వికారంగా... వికృతంగా కనిపిస్తోంది. ★

